క్లుప్తంగా

పెపులైన్ లీక్.. తాగునీరు వృథా



కరప సమీపంలో మంచినీటి పైపులైన్ లీకై వృథాగా పోతున్నతాగునీరు

కరప: మంచినీటి పైపులైన్ లీకవ్వడంతో తాగునీరు వృథాగా పోతోంది. పెనుగుదురు నుంచి పైపులైన్ ద్వారా కొరిపల్లి, జెడ్.భావారం, పేపకాయలపాలెం గ్రామాలకు మంచినీరు సరఫరా అవుతుంది. కరప, పెనగుదురు గ్రామాల మధ్య సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహం వద్ద ఈ పైపులైన్‌కు కన్నం పడటంతో తాగునీరు వృథాగా పోవడమే కాకుండా, భక్తులకు ఇబ్బందిగా ఉంటోంది. భూమిలో పైపులైన్‌కు కన్నం పడటం వల్ల మట్టి, బురద లోపలకు వెళ్లి తాగునీరు కలుషితమై, అంటువ్యాధులు వ్యాపించే అవకాశముందని ప్రజలు అంటున్నారు. అధికారులు స్పందించి మంచినీటి పైపులైన్ లీక్ అరికట్టి, తాగునీరు కలుషితమవ్వకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కరప: కాకినాడ రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కరప, కొవ్వూరు పంచాయతీ పరిధిలోని బీసీ ఏరియాలోని అంగన్‌వాడీహెల్పర్ పోస్టు భర్తీచేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చామని, అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ వై.లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కరప, కరప–8లో అంగన్‌వాడీ సహాయకురాలు(ఎస్సీ) క్యాటగిరికి రిజర్వ్ చేశారన్నారు. అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు 10వ తరగతి ఉత్తీర్ణులైన, స్థానిక వివాహిత మహిళలు అర్హులన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాలు తీసుకుని అర్హులైనవారు దరఖాస్తు చేయాలని, సెలెక్షన్ కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపిక చేస్తామన్నారు. కాకినాడరూరల్ ఐసీడీఎస్ కార్యాలయం (సర్పవరం పూలమార్కెట్ వీధి, నియర్, సర్పవరం గ్రామసచివాలయం–1)లో దరఖాస్తులు తీసుకుని, పూర్తిచేసిన దరఖాస్తులు అదే కార్యాలయంలో ఈనెల 17వ తేదీలోగా అందజేయాలని సీడీపీఓ తెలిపారు. మిగిలిన వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్



డాక్టర్ మహేష్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్

కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల చెప్పారు. జగనన్నకు చెబుదాంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 9:30 నుంచి 10:30 గంటల మధ్యలో ప్రజలు కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నంబర్ 0884 2357800కు కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చునన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. 10:30 నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

హరీష్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

ఏఆర్ ఏఎస్పీ సత్యనారాయణ



దుప్పట్లు అందజేస్తున్న సత్యనారాయణ

బాలాజీచెరువు: విద్య,వైద్య రంగాలతో పాటు ఆధ్యాత్మికంగా దేవాలయాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు చేయూతనిస్తున్న హరీష్ చారిట్రబుల్ ట్రస్ట్ కార్యక్రమాలు అభినందనీయమని ఏఆర్ ఏఎస్పీ బి.సత్యనారాయణ పేర్కొన్నారు. తూరంగి వృద్ధాశ్రమానికి ట్రస్ట్ ద్వారా దుప్పట్లు, పండ్లు, చీరలు ఆదివారం పంపిణీ చేసి ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. ట్రస్ట్ చైర్మన్ తలాటం హరీష్ మాట్లాడుతూ ఇటీవలే పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలో ఉత్తీర్ణులై ఫిజికల్ టెస్ట్‌కు హాజరైన అభ్యర్థులకు స్పోర్ట్స్ సామగ్రి ఉచితంగా అందజేశామని, అర్హత ఉన్న సరైన సదుపాయాలు లేనివారు తనను సంప్రదిస్తే వారికి తన ట్రస్ట్ ద్వారా సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరబాబు, దొరబాబు ,కోటి, సురేష్, శ్రీను పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కాకినాడ రూరల్: మండలంలోని గంగనాపల్లి గ్రామంలో పాదాలమ్మ గుడి వెనక ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఇంద్రపాలెం పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.24,380 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై నాగరాజు తెలిపారు.

నాటకాలకు పెరుగుతున్న ఆదరణ

- సందేశాత్మకంగా సాగుతున్న ప్రదర్శనలు
- యువతను ఆకర్షిస్తున్న పరిషత్‌లు

కాకినాడ కల్చరల్: కళల కాణాచి కాకినాడలో రోజురోజుకు కళారంగంపై జనానికి ఆసక్తి పెరుగుతోంది. ముఖ్యంగా నాటక రంగంపై మరింత ఆదరణ పెరుగుతోంది. యువ కళాకారులను ప్రోత్సహించేందుకు పరిషత్‌లు ఎంతో కృషి చేస్తున్నాయి. నాటకాలకు ప్రేక్షకుల ఆదరణ పెరిగిందనే చెప్పాలి. అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలకు ప్రేక్షకులు పెద్దఎత్తున హాజరయ్యారు. పరిషత్‌లు బాల నటులను కూడా ప్రోత్సహించి నాటక రంగాన్ని బతికించేందుకు తమ వంతు కృషి చేస్తున్నాయి. యువత నాటక రంగానికి ఆకర్షితులయితేనే నాటక రంగం మరింత ఆదరణ పొందుతుందని సీనియర్ కళాకారులు అంటున్నారు. ఈ దిశగా నాటక పరిషత్‌లు అడుగులు వేస్తున్నాయి. ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించేందుకు నాటక పోటీలు నిర్వహించి మంచి ఫలితాలను సాధిస్తున్నాయి. సమాజాన్ని ప్రభావితం చేసే శక్తి నాటకానికి మాత్రమే ఉంది. సమాజంలో జరిగే అంశాలనే ఇతివృత్తాలుగా తీసుకొని రచయితలు నాటకాలు రూపొందిస్తున్నారు. వీటిని ప్రదర్శిస్తూ మంచి సందేశాన్ని ప్రజలకు నాటిక రూపంలో అందజేస్తున్నారు.



ఇటీవల సూర్యకళామందిర్‌లో ప్రదర్శించిన మనస్విని నాటికలో ఒక సన్నివేశం (ఫైల్)

యువత ముందుకు రావాలి



నాటక రంగం చాలా గొప్పది. ఈ రంగాన్ని కాపాడుకోవల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా యువత నాటక రంగం వైపు ఆకర్షితులయ్యే విధంగా పరిషత్‌లు ప్రణాళికలు రూపొందించాలి. అప్పుడే నాటాకలు పదికాలాల పాటు సజీవంగా నిలిచి మనందరిలో ఉంటాయి. యువతను ఆకట్టుకొనేందుకు పరిషత్‌లు చేస్తున్న కృషి అభినందనీయం.

– బుచ్చియ్యచౌదరి, నటుడు, వీరన్న పాలెం

నటుల కొరత



నాటకం రంగంలో నటుల కొరత ఉంది. ప్రస్తుతం నాటక రంగానికి ఆదరణ బాగానే పెరుగుతోంది. ఈ తరుణంలో వర్ధమాన నటులు కూడా నాటక రంగానికి ప్రభావితులయితే నాటకాలు చిరకాలం నిలిచిపోతాయి. సమాజంలో మంచిచెడులను ప్రేక్షకులకు చక్కగా వివరించే గొప్ప శక్తి నాటకానికి మాత్రమే ఉంది. నటుల కొరతను పూరించేందుకు పరిషత్ మరింత కృషి చేయాల్సి ఉంది.

– పీవీ పురుషోత్తం, నటుడు, విజయవాడ

మంచి రచనలు నాటకానికి ప్రాణం



సినిమా అయినా నాటిక అయినా ఆ రచనపై ప్రధానంగా ఆధారపడి ఉంటుంది. మంచి సందేశాత్మక రచనలతో నాటకం ప్రదర్శిస్తే మంచి ఫలితం ఉంటుంది. ప్రస్తుతం నాటక రంగంలో రచయితలు తగ్గిపోతున్నారు. యువత ముందుకు వచ్చి నాటిక రచనలు చేపట్టాలి. నాణ్యమైన రచనలకు ఎప్పుడూ ఆదరణ ఉంటుంది.

– ఎస్.వెంకటేశ్వర్లు, నాటక రచయిత, వీరన్నపాలెం

నాటకాలు వారసత్వ సంపద



నాటక రంగాన్ని మన వారసత్వ సంపదగా భావించి ఈ రంగాన్ని చిరకాలం నిలిపేందుకు మనమందరం శక్తివంచన లేకుండా కృషి చేయాలి. మన భావి తరాలకు నాటక రంగాన్ని అందించాలి. మన దేశానికి వారసత్వ సంపదలయిన కళలను కాపాడుకోవాల్సిన అవసరం మనపై ఉంది. పరిషత్ ద్వారా బాల నటులను తయారు చేయడమే కాకుండా, యువనటులను ప్రోత్సహించేందుకు నాటక పోటీలు నిర్వహిస్తున్నాం.

– పంపన దయానందబాబు, అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్, వ్యవస్థాపక కార్యదర్శి, నటుడు, కాకినాడ

బ్రాహ్మణ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

బోట్‌క్లబ్: ప్రతిభగల బ్రాహ్మణ బాలబాలికలకు ప్రోత్సాహకాలు అందివ్వనున్నట్లు నగర బ్రాహ్మణ సేవా సంఘం కార్యదర్శి ముంజులూరి విశ్వేశ్వరరావు అన్నారు. రామారావుపేటలోని బ్రాహ్మణ సేవా సంఘం కార్యాలయంలో ఆదివారం సంఘ సమావేశం నిర్వహించారు. ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు వచ్చిన బ్రాహ్మణ బాలబాలికలకు నగదు బహుమతితోపాటు , సంఘం తరఫున ప్రశంసాపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులు వారి మార్కుల లిస్ట్ కాపీ ఈ నెల 15 లోపు సంఘ అధ్యక్షుడు అజ్జరపు సత్యనారాయణమూర్తికి అందించాలన్నారు. వివరాలకు 8885551614 నంబర్‌లో సంప్రదించవచ్చునన్నారు.

వీఆర్వోల అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ ప్రసాద్

కాకినాడ రూరల్: ఆంధ్రప్రదేశ్ వీఆర్వో అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా సర్పవరం వీఆర్వో పాలచర్ల సాయి సత్యనారాయణ ప్రసాద్ ఎన్నికయ్యారు. విజయవాడలోని గ్రామ రెవెన్యూ అధికారుల భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఏపీ వీఆర్వో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కోన అజయ్‌కుమార్ , రాష్ట్ర కార్యదర్శిగా అనుపమ, సంయుక్త కార్యదర్శిగా కె.చిన్నారావు తదితరులు ఎన్నికైనట్టు ఉపాధ్యక్షుడినిగా ఎన్నికైన సర్పవరం వీఆర్వో తెలియజేశారు.

సత్యదేవ మందిరాన్ని సందర్శించిన ఉడిపి స్వామీజీలు



సత్యదేవ మందిరంలో గోపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఉడిపి స్వామీజీలు

బోట్‌క్లబ్: కాకినాడ పర్యటనలో భాగంగా ఉడిపి స్వామిజీలు సుగుణేంద్ర తీర్థ, ఉత్తరాధికారి సుశీంద్ర తీర్థులు ఆదివారం స్థానిక గొడారిగుంట జర్నలిస్టుకాలనీలో ఉన్న రమాసహిత సత్యదేవ మందిరంలో దాసాంజనేయ ఉమా సాంబశివ మందిరాన్ని సందర్శించారు. స్వామీజీలకు పూర్ణకుంభంతో మందిర నిర్వాహకులు యాతగిరి మధ్వేష్ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ మధ్వ మతానుసారం పూజాది కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తూ మతాచారాన్ని పరిరక్షిస్తున్నారన్నారు. కోటిగీత లేఖన యజ్ఞం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతీ ఒక్కరూ సంధ్యావందనాది దేవతార్చన కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా భగవంతుని అనుగ్రహం పొందవచ్చునన్నారు. ఈ ప్రాంతంలో మధ్వమత వృద్ధికి నిరంతరం అనేక కార్యక్రమాలు నిర్వహించడమేకాక గురువుల అనుగ్రహంతో స్వగృహంలోనే మందిరాన్ని ఏర్పాటు చేసుకొని మధ్వులకు ఆధ్యాత్మిక సేవలందిస్తున్న యాతగిరి మధ్వేష్‌ను స్వామీజీలు ఆశీర్వదించారు. అనంతరం యతగిరి పరశురాం, తుంగమణి దంపతులు స్వామీజీలకు పాదపూజ నిర్వహించారు. అనంతరం స్వామీజీలు గోపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎంఆర్‌పీఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సుధాకర్



సుధాకర్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న సంజయ్

కాకినాడ సిటీ: మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కాకినాడ నగరానికి చెందిన ప్రముఖ సామాజిక వేత్త, సోషల్ వర్కర్ బొజ్జంగి సుధాకర్‌ను నియమిస్తున్నట్లు ఎంఆర్‌పీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బంగ సంజయ్ మాదిగ వెల్లడించారు. మాదిగల ఆత్మ గౌరవం నిలబెట్టే రాజకీయ పార్టీలకు తమ సంపూర్ణ మద్దతు ఇస్తామని ఆయన ప్రకటించారు. ఆదివారం కాకినాడ గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన కాకినాడ జిల్లా ఎంఆర్‌పీఎస్ఎస్ నూతన కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా పాలకులు మాదిగల సంక్షేమం విస్మరిస్తున్నారన్నారు. మాదిగలు సమాజంలో వివక్షకు గురవుతూ అవమానాలు ఎదుర్కొంటున్నారని సంజయ్ అన్నారు. నూతన కార్యవర్గంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బొజ్జంగి సుధాకర్, కోనసీమ జిల్లా ఉపాధ్యక్షుడిగా బొమ్మ లక్ష్మణరావు, రామచంద్రపురం మండల అధ్యక్షుడిగా బొమ్మ రాంబాబు, కాకినాడ జిల్లా ఇన్‌చార్జిగా తాతపూడి మూర్తి, కాకినాడ సిటీ అధ్యక్షుడిగా పలివెల విజయకుమార్, కాకినాడ టౌన్ అధ్యక్షుడిగా విప్పర్తి కుమార్, కాకినాడ జిల్లా కళా చైతన్య దండోరా జిల్లా అధ్యక్షుడిగా మద్దాల రామారావు, కాకినాడ టౌన్ గౌరవాధ్యక్షుడిగా సవరపు నాగరాజు, అనపర్తి నియోజకవర్గ అధ్యక్షుడిగా కాలేటి రామకృష్ణలను నియిమంచినట్లు బుంగ సంజయ్ తెలిపారు.

బ్యాంకు రుణాల మంజూరుపై అవగాహన



ఎస్‌బీఐ రుణాలపై వివరిస్తున్న ఆర్‌ఎం తపోధన్

బాలాజీచెరువు: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన బ్రాంచ్‌లో అందజేస్తున్న రుణాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకినాడ రీజనల్ మేనేజర్ తపోధన్ హాజరై నగరంలో ఉన్న ఆటో యూనియన్ సభ్యులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా అందజేస్తున్న బీమా పథకాలు, ఆటోలకు ముద్ర రుణాలు, పీఎంజేజేబీవై ,సుకన్య సమృద్ధి యోజన, పీఎం ఎస్‌బీవై, ఏపీవై ఎస్ఎస్‌వై వంటి పథకాలను వివరించారు. ఆటో కొనుగోలుకు సంబంధించి ఏవిధమైన హామీ లేకుండా రుణాలు ఇస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఐ మేనేజర్ జనార్థన్, మెయిన్ బ్రాంచ్ ఛీఫ్ మేనేజర్ లక్ష్మీ కాంతారావు, జనరల్ మేనేజర్ పరమేశ్వరరావుతో పాటు నగర ఆటోయూనియన్ల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

జంక్షన్.. టెన్షన్



హైవేపై ప్రమాదకరంగా ఉన్న చిన్నింపేట జంక్షన్

ఏలేశ్వరం: పదహారో నంబర్ జాతీయ రహదారిపై మండల పరిధిలోని చిన్నింపేట జంక్షన్ ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ జంక్షన్ మీదుగా నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సిరిపురం నుంచి వచ్చే వాహనాలు మలుపు తిరిగే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ సెంటర్‌లో బస్టాండ్ నిర్మించాలని గ్రామస్తులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు సమర్పించినా ఫలితం లేదు. ఈ ప్రాంతంలో వీధి దీపాలు ఏర్పాటుతో పాటు సెక్యూరిటీ గార్డును నియమిస్తామని ప్రకటిస్తున్న అధికారులు తరువాత పట్టించుకోవడం లేదు. ట్రాఫిక్ నియంత్రణకు బోర్డులు ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారనే వాదనలు ఉన్నాయి.

ఆగస్టులో ఆర్‌ఓబీ నిర్మాణం పూర్తి

- సీఎం చేతుల మీదుగా ప్రజలకు అంకితం
- ఎమ్మెల్యే ద్వారంపూడి వెల్లడి
- కొండయ్యపాలెం ఫ్లైఓవర్ నిర్మాణ పనుల పరిశీలన



ఆర్‌ఓబీ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: కొండయ్యపాలెం ఫ్లైఓవర్ నిర్మాణ పనులను ఆగస్టు చివరి నాటికల్లా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. ఈ ఆర్‌ఓబీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రజలకు అంకితం చేయనున్నామన్నారు. ఆదివారం ఆయన నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి ఆర్‌ఓబీ నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే ద్వారంపూడి విలేకరులతో మాట్లాడుతూ 2009లో వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ ఫ్లైఓవర్ మంజూరైందన్నారు. అనంతరం టీడీపీ హయాంలో నిర్మాణ ప్రగతి కుంటుపడి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. 2019లో తాము అధికారంలోకి వచ్చాక భూ సేకరణ సమస్య, ఇతర అంశాలను పరిష్కరించి నిధులు విడుదల చేయించి నిర్మాణాన్ని వేగం పెంచామన్నారు. త్వరలోనే అన్ని పనులు పూర్తి చేసుకుని వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తికానున్న నేపథ్యంలో శారదాదేవి ఆలయం వైపు ట్రాఫిక్ ఒత్తిడిని దృష్టిలో ఉంచుకొని రూ.16 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో అదే ప్రాంతం నుంచి ప్రభుత్వ ఐటీఐ దగ్గరగా నాలుగు లైన్ల రహదారిని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, ఇచ్చిన హామీల అమలు కోసం నిబద్ధతతో పనిచేస్తున్నామన్నారు.

ఫ్లైఓవర్‌కు ముత్తా పేరు

నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకోనున్న కొండయ్యపాలెం ఆర్‌ఓబీకి మాజీ మంత్రి ముత్తా గోపాలకృష్ణ పేరు పెట్టనున్నట్లు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. సుదీర్ఘకాలం పాటు శాసనసభ్యునిగా, మంత్రిగా ఇక్కడ సేవలు అందించిన ముత్తా గోపాలకృష్ణ ఈ ప్రాంత అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్నారని, అందువల్లే రాజకీయాలకు అతీతంగా ఆయన పేరు పెట్టాలని నిర్ణయించామన్నారు. అభివృద్ధి పట్ల ఆయనకు విజన్ ఉంది. ఆయన బాటలో నడిచేందుకు నేను కూడా ఇష్టపడతానంటూ ఎమ్మెల్యే పేర్కొన్నారు. కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, ఏఎంసీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, మాజీ కార్పొరేటర్లు ఐ.శ్రీను, రాగిరెడ్డి బన్నీ, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, నాయకులు గూటాల రామకృష్ణ, వాసుపల్లి కృష్ణ, మన్నే నాగేశ్వరరావు, రాయప్రోలు కృష్ణమూర్తి, బసవా అశోక్, డీఈ సుబ్బారావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ కిటకిట



ప్రయాణికులతో ఒకటో నంబరు ప్లాట్‌ఫాం

సామర్లకోట: స్థానిక రైల్వేస్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడింది. శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు సెలవులు రావడంతో ఆయా ప్రాంతాల నుంచి వచ్చినవారు తిరుగు ప్రయాణాలకు సిద్ధం అయ్యారు. పెద్దాపురం, కిర్లంపూడి, వేట్లపాలెం, సామర్లకోట, తదితర ప్రాంతాలకు చెందినవారు సామర్లకోట రైల్వే స్టేషన్ మీదుగా రాక పోకలు సాగించవలసి ఉంది. దాంతో ఆయా ప్రాంతాలకు చెందిన వారు తిరుగు ప్రయాణం కోసం రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు.

ఆకట్టుకొన్న స్థిరాస్తి



స్థిరాస్తి నాటికలో ఒక సన్నివేశం

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళామందిర్‌లో అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వానపు నాటికల పోటీలు ఆదివారంతో ముగిశాయి. దీనిలో భాగంగా సాయంత్రం సమాజ సేవకులు టి.రామకృష్ణ జ్యోతి వెలిగించి నాటికల ప్రదర్శన ప్రారంభించారు. ముందుగా కళానికేతన్ (వీరన్నపాలెం) సమర్పణలో ఎస్.వెంకటేశ్వర్లు దర్శకత్వంలో ప్రదర్శించిన 'స్థిరాస్తి' నాటిక ప్రేక్షకులను ఆకట్టుకొంది. దేశంలో సహాయం చేసేవారి శాతం అనూహ్యంగా పెరిగితే ఆ దేశంలో ఉన్న పేదరికం సమాధి అవుతుందనే సందేశంతో నాటిక సాగింది. అనంతరం మైత్రి కళానిలయం (విజయవాడ) సమర్పణలో టీవీ పురుషోత్తం దర్శకత్వంలో ప్రదర్శించిన 'ఇతిహాసం' నాటిక ప్రేక్షకులను ఆలోచింపచేసింది. కనిపెంచిన తల్లికి ఆధునిక యుగంలో ఎటువంటి గౌరవం ఇస్తున్నామో నాటికలో కళ్ళకు కట్టినట్టు ప్రదర్శించారు. మన సంస్కృతికి చిహ్నాలయిన ఇతిహాసాలలో తల్లి పాత్ర ఎంతో కీలమయినదో తెలిసి కూడా మనలో కొందరు తల్లిని గౌరవించడం లేదని ప్రేక్షకులకు వివరించే ప్రయత్నం నాటికలో చేశారు. ఈ కార్యక్రమంలో పరిషత్ గౌరవ అధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, అధ్యక్షుడు కర్రి అచ్యుత రామారెడ్డి, వ్యవస్థాప కార్యదర్శి పంపన దయానందబాబు, కృష్ణారెడ్డి, పంపన మురళి పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కేటింగ్ పోటీలు



తునిలో స్కేటింగ్ పోటీల విజేతలకు మెడల్స్ అందజేస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: చిన్నారుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు నిర్వహించిన రోలర్ స్కేటింగ్ పోటీలకు అనూహ్య స్పందన రావడం ఆనందంగా ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. ఆదివారం పురపాలకసంఘం ఆధ్వర్యంలో స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. స్థానిక రాజా రాజబాబు మున్సిపల్ పార్కులోని స్కేటింగ్ ట్రాక్‌లో రాత్రి జరిగిన ఫైనల్స్‌లో ప్రతిభ చూపిన చిన్నారులకు చైర్‌పర్సన్ సుధారాణి మెడల్స్ అందజేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు స్కేటింగ్ నేర్పించాలన్నారు. భవిష్యత్‌లో జిల్లా స్థాయి పోటీలను తునిలో నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మను దర్శించుకున్న ఆర్డీఓ రామారావు



మరిడమ్మ ఆలయంలో ఆర్డీఓ దంపతులను ఆశీర్వదిస్తున్న వేద పండితులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో ఆర్డీఓ జేఎస్ రామారావు దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసం జాతర ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఆయనకు ఆలయ చైర్మన్ చింతపల్లి బ్రహ్మాజీ, ఈఓ సీహెచ్ రామ్మోహనరరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వారికి పండితులు ఆశీర్వచనం అందించారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

ఎమ్మెల్యే ద్వారంపూడి



జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి

కాకినాడ సిటీ: వ్యాయామం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. కాకినాడ రేచర్లపేట కమ్యూనిటీ హాలు వద్ద రూ.40 లక్షల స్మార్ట్ సిటీ నిధులతో ఏర్పాటు చేసిన ఆధునిక పరికరాల వ్యాయామ కళాశాలను ఆయన ప్రారంభించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు ఈ జిమ్ ఏర్పాటు చేశామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రేచర్లపేట ప్రాంత అభివృద్ధికి ఇప్పటికే ఎంతో కృషి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీగా ఎన్నికైన కర్రి పద్మశ్రీ, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, డివిజన్ ఇన్‌చార్జిలు తొంపల తాతారావు, సిగల మధు, నందకుమార్, బత్తిన రాజు, పార్టీ నాయకులు బళ్ల సూరిబాబు, దొర్ల చిట్టిబాబు, దొర్ల రాజేష్, వ్యాయామ కళాశాల కోచ్ కుంచే మధుసూదన్, కుంచే అప్పారావు పాల్గొన్నారు.